ప్లాస్టిక్‌ను నివారించండి

సుభాష్‌నగర్‌: తినుబండారాల పరిశ్రమల తనిఖీకి వచ్చిన మేయర్‌ విజయలక్ష్మిని పర్యావరణ పరిరక్షకుడు రవీందర్‌ ముదిరాజ్‌ కలిశారు. ప్లాస్టిక్‌ కవర్ల తయారీ, పేపర్‌ ప్లేట్స్‌ కంపెనీల స్థానంలో పర్యావరణానికి హాని కలగకుండా మోగుదాకులతో తయారయ్యే విస్తరాకులను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు అతను చేస్తున్న కృషిని మేయర్‌ అభినందించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: డాక్టర్‌ అగర్వాల్‌ కంటి హాస్పిటల్‌ సౌజన్యంతో గురువారం సోమయ్య నగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు బస్తీ అధ్యక్షులు తోక యాదగిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. కార్పొరేటర్‌ జగన్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కంటి మీద ఏర్పడ్డ పొరలకు ఉచితంగా ఆపరేషన్‌, అందుబాటు ధరలలో కంటి అద్దాలు డాక్టర్‌ అగర్వాల్‌ కంటి హాస్పిటల్‌ వారు అందజేస్తారన్నారు. ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అనాథాశ్రమం ప్రారంభం


అనాథ పిల్లలతో హన్మంత్‌ రెడ్డి

జగద్గిరిగుట్ట: అనాథ పిల్లల కోసం ఆశ్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌ పరిధిలోని రింగ్‌ బస్తీలో హోరేబ్‌ చిల్డ్రన్‌ ఆర్ఫనేజ్‌ అనాథ పిల్లల ఆశ్రమ భవనాన్ని ప్రారంభించారు. ఆశ్రమ నిర్మాణానికి కృషి చేసిన సభ్యులను అభినందించారు. హోరేబ్‌ మినిస్ట్రీస్‌ సభ్యులు మధుకర్‌ బైల్ల, సోను మధుకర్‌, డివిజన్‌ అధ్యక్షులు గణేష్‌, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు సంజీవ రెడ్డి, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు

జీడిమెట్ల: విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యావేత్త గురుచరణ్‌ అన్నారు. బుధవారం అపురూప కాలనీలోని టీవీఆర్‌ మోడల్‌ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్‌ తరగతులు నిర్వహించారు. పాఠశాల అకాడమిక్‌ డైరెక్టర్‌ రవితో పాటు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


రాంచందర్‌ (ఫైల్‌)

జగద్గిరిగుట్ట: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్‌కు చెందిన రాంచందర్‌ (55) ఈ నెల 15న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. ఇలా చాలా సార్లు వెళ్లినా.. మళ్లీ తిరిగి వచ్చేవాడు. ఈ సారి తిరి రాలేదు. చుట్టుపక్కల ఆరా తీయగా.. 3 రోజుల పాటు కూకట్‌పల్లిలో కనిపించినట్లు, ఆ తర్వాత మియాపూర్‌లో కూడా కనిపించినట్లు చూసిన వారు తెలిపారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధికారులూ.. ఇటు చూడరూ!



రంగారెడ్డినగర్‌: ప్రతి నిత్యం చెట్ల కొమ్మల తొలగింపు నెపంతో విద్యుత్‌ సరఫరా కట్‌ చేస్తున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి.. ప్రధాన రహదారుల వెంబడి తీగలకు కలుపు మొక్కలు అల్లుకుని దర్శనమిస్తూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తున్నాయి. రంగారెడ్డినగర్‌ డివిజన్‌ పరిధి గిరినగర్‌ ప్రధాన రహదారిలో ఓ విద్యుత్‌ స్తంభానికి తీగలు గుబురుగా అల్లుకున్నాయి. నిత్యం ఇదే రహదారి మీదుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా తీగలు కనిపించడం లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నోటీసులిచ్చినా డోంట్‌ కేర్‌

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- నోటీసు ఇచ్చి వదిలేసిన అధికారులు
- నెల రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం


అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గోదాం

కుత్బుల్లాపూర్‌: గాజులరామారం సర్కిల్‌ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఒక వైపు సర్కిల్‌ అధికారులు నోటీసులు జారీ చేస్తున్న డోంట్‌ కేర్‌ అంటూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటీవల టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు ఉప కమిషనర్‌ మల్లారెడ్డి ఆదేశాలతో పలు అక్రమ నిర్మాణాలను సీజ్‌ చేశారు. ఇవేమీ తమ పరిధికి రాదన్నట్లుగా కొంతమంది వాటిని తొలగించి నిర్మాణాలు చేపట్టడం విశేషం. తాజాగా గాజులరామారం గ్రామం సమీపంలోని ఓ బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ ముందు సర్వే నంబర్‌ 467, 469, 474 లలో ఓ నిర్మాణదారుడు భారీ షెడ్డు ఏర్పాటు చేశాడు. స్థానికులు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేయడంతో టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు మొదటి నోటీసు జారీ చేసి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరగా.. ఆ నోటీసును పట్టించుకోకుండా నిర్మాణదారుడు పనులు వేగవంతం చేశాడు. ఈ నేపథ్యంలో డిసెంబర్‌ 16వ తేదీన ప్రొసీడింగ్‌ నెంబర్‌ 260/ యూ సీ/ టీ పీ/ సీ ఐ ఆర్‌-26/ కే పీ జెడ్‌/ జీహెచ్‌ఎంసీ/ 2024 ప్రకారం చివరి స్పీకింగ్‌ నోటీస్‌ ఆర్డర్‌ జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇంకే ముంది నిర్మాణదారుడు సదరు నిర్మాణాన్ని పూర్తి చేశాడు. అదేపనిగా ఈ నిర్మాణం పై ఫిర్యాదులు రావడంతో.. ఈనెల 10వ తేదీన మరో మారు టౌన్‌ ప్లానింగ్‌ సిబ్బంది గంపలు, పారలు, ఇతర సామగ్రిని సీజ్‌ చేసి సర్కిల్‌ కార్యాలయానికి తరలించారు. ఇలా ఇదొక్కటే కాదు అనేక ప్రాంతాల్లో ఇటువంటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కిల్‌- 26 లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా సదరు అక్రమ నిర్మాణాలకు విద్యుత్‌ శాఖ అధికారులు లక్షల్లో డబ్బులు తీసుకొని వారికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారని పలువురు చర్చించుకుంటున్నారు.


సీజ్‌ చేసిన సామగ్రిని ఆటోలో తరలిస్తూ..

రెండు రోజుల్లో సీజ్‌ చేస్తాం



ఎటువంటి అనుమతి లేకుండా చేపడుతున్న గోదాం పై ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో మొదటి నోటీసు, స్పీకింగ్‌ ఆర్డర్‌ జారీ చేశాం. అయినప్పటికీ అక్కడ పనులు జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చింది. టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు ఇదే విషయాన్ని చెప్పాను. సదరు అక్రమ నిర్మాణాన్ని రెండు రోజుల్లో సీజ్‌ చేస్తాం. ఎక్కడ అక్రమ నిర్మాణాలు చోటు చేసుకున్న ఫిర్యాదు చేస్తే తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– మల్లారెడ్డి, గాజులరామారం ఉప కమిషనర్‌

అధికారుల తీరుతో అభివృద్ధి జరగడం లేదు

కౌన్సిలర్‌ జక్కుల కృష్ణయాదవ్‌


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయాదవ్‌

దుండిగల్‌: మున్సిపల్‌ అధికారుల బాధ్యతారాహిత్యంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని దుండిగల్‌ మున్సిపల్‌ కౌన్సిలర్‌ జక్కుల కృష్ణయాదవ్‌ అన్నారు. అభివృద్ధి పనులకు టెండర్లు పిలవకపోవడంపై ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ వార్డులో రూ.1.50 కోట్ల పనులకు కౌన్సిల్‌ ఆమోదం పొంది రెండు సంవత్సరాలు కావస్తున్నా టెండర్లకు నోచుకోవడం లేదన్నారు. 2023లో తన వార్డులో ఎలక్ట్రికల్‌ ట్రాన్స్‌ఫార్మర్‌, పోల్స్‌ షిఫ్టింగ్‌ కోసం రూ. 15 లక్షలు, పెద్ద చెరువు నాలా నిర్మాణానికి రూ.15 లక్షలు, హెచ్‌డీపీపీ వాటర్‌ పైపులైన్‌కు రూ 5 లక్షలు, ముదిరాజ్‌ భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు, ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు కేటాయించినా టెండర్లకు పిలవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌ పదవీ కాలం ముగుస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ సత్యనారాయణ రావు, ఏఈ సురేందర్‌ నాయక్‌ నిర్లక్ష్యంతోనే అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమ్యూనిటీహాల్‌ నిర్మాణానికి సహకరించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్‌: కుల సంఘాలకు గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం భూములు కేటాయించి, వారి అభ్యున్నతికి కృషి చేసిందని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. కొంపల్లి మున్సిపల్‌ ఉమామహేశ్వర కాలనీకి చెందిన వడ్డెర సంఘం సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను క్యాంప్‌ కార్యాలయంలో కలిసి కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, కొంపల్లి ఉమామహేశ్వర కాలనీ వడ్డెర సంఘం సభ్యులు వల్లెపు అంజయ్య, మంజల వెంకయ్య, వల్లెపు మహేష్‌, బోసు సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌ పరిశ్రమల్లో నాణ్యత పాటించాలి


శ్రీ మహాలక్ష్మి కంపెనీలో స్వీట్ల తయారీని పరిశీలిస్తున్న నగర మేయర్‌


జీపీ కంపెనీలో అపరిశుభ్రతపై యజమానిని నిలదీస్తున్న మేయర్‌ విజయలక్ష్మి

- జీహెచ్‌ఎంసీ మేయర్‌ విజయలక్ష్మి
- పరిశుభ్రత పాటించని రెండు కంపెనీలు వారం రోజులు మూసివేత

సుభాష్‌నగర్‌: తినుబండారాల తయారీ పరిశ్రమల యాజమాన్యాలు పరిశుభ్రత, నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి హెచ్చరించారు. గాజులరామారం డివిజన్‌ సూరారంలో బుధవారం సాయంత్రం మిక్చర్‌ తయారీ జీపీ కంపెనీ, స్వీట్ల తయారీ మహాలక్ష్మి కంపెనీని తనిఖీ చేశారు. లక్ష్మీనగర్‌లోని జీపీ కంపెనీలో పరిశుభ్రత, ఫైర్‌సేఫ్టీ, కంపెనీ బోర్డు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్తింపు లేని కంపెనీల పిండి పదార్థాలు, కాలం చెల్లిన పిండిని గుర్తించి యజమానిని ప్రశ్నించారు. కార్మికుల చేతులకు గ్లౌజ్‌లు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సూరారంలోని శ్రీ మహాలక్ష్మి స్వీట్ల పరిశ్రమను తనిఖీ చేశారు. చెత్త పక్కనే స్వీట్లు తయారీని గమనించి యజమానిపై మండిపడ్డారు. స్థానికంగా ఉన్న ఫుడ్‌ సేఫ్టీ అధికారులను పిలిచి ఇలాంటి పరిశ్రమలపై తనిఖీ చేస్తున్నారా లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వారంపాటు మూసివేత

'మొదటి హెచ్చరికగా భావించి ఈ పరిశ్రమలను సీజ్‌ చేయడం లేదు, వారంపాటు మూసి వేస్తున్నాం. అంతలోపు పరిశుభ్రత, ఫైర్‌ సేఫ్టీ కల్పించాలి' అని మేయర్‌ హెచ్చరించారు. ఇలాంటి కంపెనీలతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు కుమ్మక్కయ్యారని తేలితే చర్యలు తీసుకుంటామని మేయర్‌ స్పష్టం చేశారు. మేయర్‌ వెంట ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహ, విజిలెన్స్‌ అధికారి సుదర్శన్‌, ఫుడ్‌ సేఫ్టీ అధికారులు ఉన్నారు.

26న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

చింతల్‌: ఏపీహెచ్‌బీ కాలనీ జలమండలి కార్యాలయ ఆవరణలోని శ్రీకనకదుర్గ ఆలయంలో ఈ నెల 26న సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు జరిగే వ్రతాల్లో పాల్గొనదలిచే భక్తులు 73867 19214 నంబర్‌లో సంప్రదించాలని ఆలయ పూజారి కోరారు.

విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్‌: విద్యుత్‌ ఫీడర్ల పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్‌ ఏఈ శ్రీనివాస్‌ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ధోలారీ ధనీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు కొంపల్లిలోని పోచమ్మగడ్డ, హార్లిక్స్‌ఫ్యాక్టరీ గల్లీ, సాయికృపా అపార్ట్‌మెంట్స్‌, శ్రీకాంత్‌రెడ్డి గోదాములు, వెంకట్‌రెడ్డి గోదాములు, ధోలారీ ధనీ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

కేలండర్‌ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్‌: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ - విశ్వకర్మ సొసైటీ కేలండర్‌ను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ ఆవిష్కరించారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో బుధవారం సంఘం నేతలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ వైస్‌ ప్రెసిడెంట్‌ శ్రావణ్‌ కుమార్‌, ఆలయ చైర్మన్‌ కృష్ణమాచారి, ఆలయ అధ్యక్షులు శేఖర్‌ చారి, ఉపాధ్యక్షులు యాదగిరి చారి, లక్ష్మణ్‌ చారి, జనరల్‌ సెక్రెటరీ సంతోష్‌ చారి, ఆర్గనైజర్‌ అశోక్‌ చారి, బిల్లన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ


వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రంగారెడ్డినగర్‌: సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల వాల్‌ పోస్టర్‌ను బుధవారం షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం కుత్బుల్లాపూర్‌ మండల కార్యదర్శి లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. పార్టీ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులైన వారికి పింఛన్లు, కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమాలు నిర్వహించామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు దరఖాస్తుల పేరిట ప్రజలను మోసగిస్తున్నారని, ఇచ్చిన హామీల్లో 10 శాతం కూడా అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సత్యం, వెంకన్న, ఆంజనేయులు, సునీల్‌, బీరయ్య, నర్సింగ్‌, రవి తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


శంకుస్థాపన చేస్తున్న చైర్‌ పర్సన్‌ కృష్ణవేణి

దుండిగల్‌: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, పనులను సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ కృష్ణవేణి అన్నారు. మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి 9వ వార్డు సురక్ష మెడోస్‌లో రూ.10 లక్షలు, మాధవరావు నగర్‌లో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్‌ మహేందర్‌ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను కాంట్రాక్టర్‌ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ పద్మారావు, కౌన్సిలర్‌ శంభీపూర్‌ కృష్ణ, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ రవీందర్‌ యాదవ్‌, నేతలు రంగయ్య, కొల్తూరు మల్లేష్‌, కాలనీ ప్రెసిడెంట్‌ వేణు గౌడ్‌, ఆనబోయిన శ్రీకాంత్‌ యాదవ్‌, అఖి, శివ గణేష్‌, శ్రీధర్‌, రాజు, శేఖర్‌, భూపతిరావు, నర్సింగ్‌ రావు, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక తెరుచుకోని వార్డు కార్యాలయం

దరఖాస్తులు చేయడానికి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలు


మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూడా తెరుచుకోని వార్డు కార్యాలయం


వార్డు కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన స్థానికులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం వద్ద బుధవారం ప్రజల నుంచి వచ్చే అర్జీలు తీసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటు రేషన్‌కార్డులు, అటు ఇందిరమ్మ ఇళ్లు వచ్చిందా?, లేదా? అని కనుక్కోవడానికి, దరఖాస్తు చేసుకోని వారు కూడా ఫామ్‌లు ఇవ్వడానికి ఒకేసారి రావడంతో వార్డు కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఉదయం 7 గంటల నుండే ప్రజలు ఇక్కడికి రావడం మొదలు పెట్టారు. ఫిర్యాదులు స్వీకరించడానికి, కనీసం సమాధానం చెప్పడానికి కూడా లేకపోవడం విశేషం. ఈ విషయమై ఓ అధికారిని వివరణ కోరగా.. తగినంత సిబ్బంది లేకపోవడం, ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్‌లో ఉండటం వల్ల వార్డు కార్యాలయంలో ఎవరూ లేరని తెలిపారు.

డిజిటల్‌ హ్యూమానిటీస్‌పై అంతర్జాతీయ సదస్సు


అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న నిపుణులు

నిజాంపేట్‌: ప్రగతినగర్‌ వీఎన్‌ఆర్‌ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీలో డిజిటల్‌ హ్యూమానిటీస్‌ గురించి మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సదస్సులో మానవుల ఉనికిపై డిజిటల్‌ సాంకేతికత ప్రభావం, సాంకేతికత ద్వారా మానవతకు జరగనున్న మేలు గురించి ఉపన్యాసాలు, చర్చలు, ప్లీనరీ ప్రసంగాలు జరగనున్నాయని సదస్సు కన్వీనర్‌ డా.వై.వీ. సుధాదేవి తెలిపారు. సదస్సులో వివిధ దేశాల నిపుణులు పాల్గొన్నారు. నేటి కాలంలో తెలిసీతెలియని సలహాలు, నాటు వైద్యాలను ఖండించటానికి డిటిటల్‌ సాంకేతికత చాలా అవసరమవుతోందన్నారు. అనంతరం ఆచార్య డా.ప్రమోద్‌ నాయక్‌ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌ కళాశాలలో హ్యూమానిటీస్‌ గురించి ఇటువంటి సదస్సుని నిర్వహిస్తున్నందుకు వీఎన్‌ఆర్‌ విజ్ఞానజ్యోతి ఐఈటీని అభినందిస్తూ ముందు ముందు కూడా తమ రెండు విద్యాసంస్థలు కలిసి పరిశోధించవచ్చని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆచార్య డా. వెంకట్‌రెడ్డి, డా.ఇందిర, విజ్ఞానజ్యోతి ప్రధాన కార్యదర్శి కోడె దుర్గా ప్రసాద్‌ తదితరులు మాట్లాడారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


బహదూర్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌

సుభాష్‌నగర్‌: దుండిగల్‌ మున్సిపల్‌ బహదూర్‌పల్లిలోని 11, 12, 13, 14 వార్డుల్లో వార్డు సభలు జరిగాయి. ముందుగా 11వ వార్డు ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన సభకు మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ బొంగునూరు శ్రీనివాస్‌ రెడ్డి, తహసీల్దార్‌ మతిన్‌, కమిషనర్‌ సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌ వివరించారు. రేషన్‌ కార్డుల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు రాని యెడల తిరిగి దరఖాస్తు చేసుకోవాలని, ఆందోళన చెందవద్దని తెలిపారు.

కార్డు ఇప్పించండి సారు..


అంజమ్మ

'నా కొడుకు జగన్నాథ రెడ్డి ఐదు సంవత్సరాల క్రితం గుండె నొప్పితో చనిపోయాడు. అప్పటి నుంచి నా కోడలు దగ్గరికి రానివ్వడం లేదు. ప్రస్తుతం బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నా. 65 సంవత్సరాల పైన ఉన్న నాకు చేతకావడం లేదు. రేషన్‌ కార్డు ఇప్పించండి' అని అంటూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బొంగులూరి శ్రీనివాస్‌రెడ్డితో అంజమ్మ అనే వృద్ధురాలు మొరపెట్టుకుంది. దీంతో శ్రీనివాస్‌ రెడ్డి తక్షణమే ఈ వృద్ధురాలికి రేషన్‌ కార్డు ఇచ్చేలా చూడాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు ఎల్లుగారి సత్యనారాయణ, కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ మున్సిపల్‌ ప్రెసిడెంట్‌ కుమార్‌ యాదవ్‌, పరశురామ్‌గౌడ్‌, సాదు యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్‌ ఆవుల పావని అన్నారు. బుధవారం నిజాంపేట్‌లోని 13వ డివిజన్‌లో ఫేజ్‌ 1లో వార్డు సభ జరిగింది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జాబితాను వార్డు ఆఫీసర్‌ సంధ్య చదివి వినిపించారు. కొత్త దరఖాస్తులు స్వీకరించారు. గతంలో ఎవరైనా రేషన్‌ కార్డులకు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోకపోతే ప్రస్తుతం జరుగుతున్న వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్‌, సాయి, సతీష్‌ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

కుత్బుల్లాపూర్‌: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొంపల్లి మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీహరి అన్నారు. ప్రజల నుంచి రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. 7, 9, 11 వార్డుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 8, 10, 12 వార్డుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సూర్యకళ, ఆదిరెడ్డి రాజిరెడ్డి, రజని, కృష్ణవేణి, శిరీష, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.


రసీదు అందజేస్తున్న కార్పొరేటర్‌ ఆవుల పావని


కొంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్‌ శ్రీహరి, కౌన్సిలర్లు

ఎవరు చెప్పినా ఆపేది లేదు!


కొనసాగుతున్న షెడ్డు నిర్మాణం

జగద్గిరిగుట్ట: 'ఎవరు చెప్పినా వినేది లేదు. నిర్మాణ పనులు ఆపేది లేదు' అన్నట్లు కబ్జాదారులు వ్యవహరిస్తున్నారు. జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం సమీపంలో ఇటీవలే షెడ్డు నిర్మాణం ప్రారంభించారు. ఈ విషయమై డిసెంబర్‌ 31న సాక్షిలో 'ప్రభుత్వ స్థలంలో షెడ్డు నిర్మాణం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ తర్వాత అధికారులు ఒత్తిడి తేవడం, అక్కడ గణేష్‌ మండపం నిర్మాణం కోసమని చెప్పడం, అప్పటికప్పుడు బ్యానర్‌ను అమర్చడం జరిగిపోయింది. మున్సిపల్‌, మండల అధికారులు షెడ్డు నిర్మాణం తొలగించాలని చెప్పినా వినకుండా నిర్మాణం కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇదే చోట గణేష్‌ నవరాత్రుల సందర్భంగా తాత్కాలిక మండపం ఏర్పాటు చేసేవారు. ఆ తర్వాత ఆ మండపాన్ని తొలగించేవారు. షెడ్డు ఏర్పాటుపై స్థానికులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా వార్డు కార్యాలయానికి ఆనుకొని నిర్మాణం జరుగుతుండటం విశేషం.